క్లుప్తంగా

కృష్ణా వాటర్ పైపులైను లీకేజీ
– ఆత్మకూరు పొలాల్లోకి చేరిన నీరు



మంగళగిరి: కృష్ణానది నుంచి తెనాలి వెళ్లే తాగు నీటి పైపులైను లీకయిన ఘటన చోటు చేసుకుంది. కృష్ణానది నుంచి తెనాలికి తాగునీటి పైపులైను నగర పరిధిలోని ఆత్మకూరు మీదుగా వుంది. పైపులైను పగలడంతో నీరు భారీగా పొలాల్లోకి చేరింది. గురువారం మధ్యాహ్నం పైపులైనుకు డ్యామేజీ ఏర్పడగా సాయంత్రం వరకు అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో నీరు పొలాల్లోకి పారుతుంది.

విద్యార్థులకు వ్యాయామంపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో పోషణ అభియాన్ పక్షోత్సవాల సందర్భంగా గురువారం, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు, విద్యార్థులకు అంగన్‌వాడీలు పోషకాహారం, వ్యాయామం గురించి అవగాహన కల్పించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పిల్లలకు ఇవ్వాలని చెప్పారు. రక్తహీనత ద్వారా పిల్లలు అనారోగ్యానికి గురవుతారని దాని నియంత్రణకు పాలు, గుడ్లు, ఆకు కూరలు, క్యారెట్ వంటి పదార్థాలు ఆహారంలో పిల్లలు తీసుకునేలా చూడాలని తెలిపారు. అనంతరం విద్యార్థులచే వ్యాయామం చేయించారు. అంగన్‌వాడీలు పద్మ, నాగలక్ష్మి, మరియజోజమ్మ, పాఠశాల హెచ్ఎం దివి కమల్‌మోహన్, శేషు రవి పాల్గొన్నారు.

24న షిర్డీ సాయినాథ మందిర వార్షికోత్సవం



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సొలసబస్టాండు సెంటరులో షిర్డీ సాయినాథ మందిర ,శీతలాంబ వార్షికోత్సవం ఈనెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయపాలక వర్గం సభ్యులు యల్లారెడ్డి, వై.శ్రీనివాసరెడ్డిలు గురువారం తెలిపారు. 24న ఉదయం నగర సంకీర్తన, కాగడహారతి, గణపతి పూజ, పుణ్యాహవాచన, నవగ్రహారాధన, అష్టదిక్పాలపూజ. విశేష అర్చనలు అర్చకులు కె.రాఘవేంద్రశర్మ, వైఖానస ఆగమ పండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు నిర్వహిస్తారని చెప్పారు. 25న విశేష అర్చనలు, అభిషేకాలు, సాయి, హనుమాన్ చాలీసాను పరవస్తు చిన్నయసూరి, గీతాభజన మండలి సభ్యులు గానం చేస్తారన్నారు. 26న విశేష అర్చనలు, భక్తులతో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేస్తామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన ఉంటుందని చెప్పారు. సాయంత్రం సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శిస్తామన్నారు.

వైభవంగా వసంతోత్సవ చక్రస్నానం



కొల్లిపర: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యహోమం , బలిహరణ పూజలు నిర్వహించి వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రచార వాహనాలకు అనుమతులు తప్పనిసరి

తెనాలిరూరల్: ఎన్నికల నేపథ్యంలో ప్రచారాలు, ర్యాలీలు, బహిరంగ సభలకు వినియోగించే వాహనాలకు అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా అనుమతులు పొందాలని తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో లేదా ఎలక్షన్ కమిషన్ 'సువిధ' యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనుమతులు లేని వాహనాలను ర్యాలీలు, ప్రచారాలు, ఇంటింటి ప్రచారాలకు వినియోగిస్తే ఎలక్షన్ కమిషన్ నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తెనాలి నియోజకవర్గంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు సంబంధించి 08644-232475 నంబరులో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

రాజకీయ విప్లవానికి మంగళగిరి నాంది

- చంద్రబాబు, లోకేష్‌లకు ఈ ఎన్నికల్లో రాజకీయ సమాధి తప్పదు
- లావణ్య, రోశయ్యలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- మురుగుడు లావణ్య పరిచయ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే, వేదికపై ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య

మంగళగిరి: 2024 ఎన్నికలలో మంగళగిరి నియోజకవర్గం రాజకీయ విప్లవానికి నాంది పలకబోతుందని, చంద్రబాబు, లోకేష్‌లకు రాజకీయ సమాధి తప్పదని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ధ్వజమెత్తారు. పట్టణంలోని చిల్లపల్లి నాగేశ్వరరావు కల్యాణ మండపంలో గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాబా సాహెబ్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే బాటలో నడుస్తూ సామాజిక సంస్కర్తగా నిరూపించుకున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం ఇచ్చి వారిని చట్టసభలలో కూర్చోబెట్టినప్పుడే సమ సమాజం ఏర్పడుతుందని భావించి ఆ దిశగా అడుగులు వేసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ అన్నారు. బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలనే సీఎం జగన్ చేనేత సామాజిక వర్గానికి చెందిన విద్యావంతురాలైన మహిళ లావణ్యకు సీటు కేటాయించారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని ఇప్పుడు అభివృద్ధి చేస్తామని వస్తున్న పగటి వేషగాళ్లు తాము అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు చేయలేకపోయారని నిలదీశారు. గత ఐదేళ్లలో నియోజవర్గాన్ని చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామన్నారు. లోకేష్ మూడు శాఖల మంత్రిగా వుండి మంగళగిరి పట్టించుకోక పోగా తాను అభివృద్ధి చేస్తుంటే కోర్టులను ఆశ్రయించి అడ్డుకునేందుకు యత్నించారన్నారు. ఎంటీఎంసీ పరిధిలో 23 వేల పేదలకు సీఆర్‌డీఏ పరిధిలో పట్టాలు ఇస్తే పేదలు మా మధ్య ఉండడానికి వీల్లేదని కోర్టును ఆశ్రయించి ఆపలేదా అని ప్రశ్నించారు. లోకేష్ చేసిన అభివృద్ధి వారి పార్టీ వారికి నాలుగు తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు ఇవ్వడమా అన్నారు. అన్నా క్యాంటీన్ పేరుతో పేదలను అన్నం పెడుతున్నామని చెప్పే లోకేష్ వారి పార్టీ నాయకులు పుట్టిన రోజులు, పెద్దల దినాల రోజులలో అన్నా క్యాంటీన్ అన్నం పెట్టిస్తున్నాడని తన జేబులో నుంచి రూపాయి తీయలేదని గుర్తించాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా కృషి చేసి మురుగుడు లావణ్యను, ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్యలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి, పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, అధికార ప్రతినిధి పచ్చల శ్యాంబాబు, మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారి, జిల్లా కార్యదర్శి ఈపూరి ఆదాం, సీనియర్ మైనార్టీ నాయకులు ఇక్బాల్ అహ్మద్, పట్టణ, రూరల్ జేసీఎస్ కన్వీనర్లు ఎండి ఫిరోజ్, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, మహిళా జిల్లా కార్యదర్శులు మల్లవరపు సుధారాణి, పాలేటి కృష్ణ, మాజీ కౌన్సిలర్లు కలకోటి స్వరూపారాణి, సంకె సునీత, నాలి వెంకటకృష్ణ, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీగా హాజరయ్యారు.

సీఎం జగన్ చెప్పాడంటే చేస్తాడంతే..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

మంగళగిరి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిందే చెస్తాడని, చేయలేనిది చెప్పడని ప్రజలు విశ్వసిస్తున్నారని ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం రాత్రి నిర్వహించిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య పరిచయ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభలకు హాజరైన జనాన్ని చూస్తేనే అర్థం అవుతుందని ఆయన మాటంటే ప్రజలకు ఎంతనమ్మకమో అన్నారు. దేశ చరిత్రలో చేయలేనిది నేను చేయలేను అని చెప్పే నాయకుడు సీఎం జగన్ అన్నారు. చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలని జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ సీఎం అని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ సీఎంగా, మురుగుడు లావణ్యను మంగళగిరి ఎమ్మెల్యేగా, కిలారు రోశయ్యను గుంటూరు ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఇచ్చిన ప్రతిహామీ నెరవేర్చిన జగనన్న

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- నెక్కల్లులో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం



గ్రామస్తులను ఆత్మీయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

నెకల్లు (తాడికొండ): ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ఎన్నికలకు వెళుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి వెళ్లి పథకాలు వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు కూడా నెరవేర్చి అభివృద్ధి అంటే మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. దేశంలో ఎన్నడూ జరగని అభివృద్ధి, సంక్షేమం, ఒక్క ఏపీలోనే జరిగిందని కేంద్ర ప్రభుత్వ సర్వేలే వెల్లడించాయన్నారు. గత ఐదేళ్ల పాలనలో చంద్రబాబు రాష్ట్రాన్ని నిర్వీర్యం చేసి, సమస్యలను గాలికొదిలేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశాడని, కానీ ఐదు సంవత్సరాల్లో 75 సంవత్సరాల భారత దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయనంతగా సంక్షేమం, అభివృద్ధిని కరోనా కష్ట కాలంలోనూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. ఈసందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి పరిచయం చేసుకుని, మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సుచరిత పర్యటనకు గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో ముఖ్య నాయకులు పి.శేషగిరిరావు, జేసీఎస్ జిల్లా నాయకులు టి.రమణారెడ్డి, సొసైటీ చైర్మన్‌లు నాయుడు నాగేశ్వరరావు, కోటిరెడ్డి, డీసీఎంఎస్ నేతలు మేకల రవికుమార్, స్థానిక నాయకులు గుమ్మా శ్రీనివాసరావు, గుమ్మా పూర్ణచంద్రరావు, సుంకర శ్రీనివాసరావు, ఎ.జక్రయ్య, ఐ.చంటి, ఎ.పుష్పలత, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలి



సీఐఎస్ఎఫ్ బలగాలతో కలసి కవాతు నిర్వహిస్తున్న ఎస్ఐలు రమేష్, ప్రతాప్ కుమార్

తాడేపల్లిరూరల్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో వున్న ప్రతి పోలింగ్ బూత్‌పై పోలీసుల నిఘా ఉందని, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం, ప్రలోభాలకు గురిచేయడం వంటివి చేస్తే సహించేది లేదని తాడేపల్లి ఎస్ఐలు రమేష్, ప్రతాప్‌కుమార్ అన్నారు. గురువారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రహ్మానందపురం, ప్రకాష్‌నగర్, కేఎల్‌రావు కాలనీల్లో సీఐఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహిస్తూ పలుచోట్ల అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, నార్త్‌జోన్ డీఎస్పీ రవికాంత్ ఆదేశాల మేరకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నామని, రాబోయే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటుహక్కు వినియోగించుకునే వారిని భయభ్రాంతులకు లేదా ప్రలోభాలకు గురిచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతి బూత్‌లో గత ఎలక్షన్‌లలో ఘర్షణకు దిగిన వారు, ప్రలోభాలకు గురిచేసిన వారిని బైండోవర్ చేశామని, ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే వారిపై కేసులు నమోదు చేస్తామని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

సువిధ యాప్ ద్వారా అనుమతులు తీసుకోవాలి

తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు



తాడికొండ: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సువిధ క్యాండిడేట్ యాప్ ద్వారా ఎన్నికల్లో పోటీ చేస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్‌లు తమ ఎన్నికల కార్యకలాపాలకు సంబంధించిన అనుమతులు తప్పక తీసుకోవాలని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడ్ ఆఫ్ కండక్ట్ ఈ నెల 16 నుంచి అమలులో ఉన్నందున ప్రశాంత ఎన్నికల నిర్వహణలో భాగంగా అన్ని వ్యవస్థల నుంచి పార్టీల కార్యాకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్, ప్రైవేటు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బ్యానర్లు, పోస్టర్లు, జెండాలు తొలగించడం జరిగిందన్నారు. అధికారుల కళ్లుగప్పి ఎక్కడైనా అనధికారికంగా పోస్టర్లు, ఇతర ప్రచారాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు తాడికొండ నియోజకవర్గంలో 4 ఫిర్యాదులు సీ విజిల్ యాప్ ద్వారా అందగా వెంటనే పరిష్కరించి సంబంధిత పోస్టర్లు తొలగించినట్లు తెలిపారు. వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు పార్టీలకు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొనడం వంటివి జరిగినా సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. నిబంధనల మేరకు ఒక్కొక్కరు రూ.50వేలు పై బడిన నగదు, రూ.10 వేలు విలువ పైబడిన బంగారం రసీదులు లేకుండా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వాటిని సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగించడం జరుగుతుందన్నారు. సువిధ యాప్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం కుదరని అభ్యర్థులకు మాన్యువల్‌గా కూడా దరఖాస్తు చేసే అవకాశం ఉందన్నారు. తాడికొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందని, ఇక్కడ 24 గంటలు తమ సిబ్బంది అందుబాటులో ఉంటారనానరు. హెల్ప్ డెస్క్ నంబర్లు 8074495632, 8125146794 లను ఫోన్ ద్వారా సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

24న క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

తెనాలి అర్బన్: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 24న తెనాలి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు సూపర్‌వైజర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తామని చెప్పారు. ర్యాలీలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్‌జీవో ప్రతినిధులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొనాలని కోరారు.

విమోచన పండుగల నిర్వహణకు విరాళం

తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో గ్రేస్ ఆఫ్ జీసస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన విమోచన పండుగల నిర్వహణకు రూ.5 వేలు విరాళంగా ఇచ్చినట్లు ఫెలోషిప్ కోశాధికారి ఎం.బర్నబాబు గురువారం తెలిపారు.
తెనాలి రూరల్ మండల పాస్టర్ అండ్ గాస్పల వర్కర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రెవరెండ్ ఎ.భానుప్రాద్ ఆధ్వర్యంలో నగదు విరాళం అందజేసినట్లు చెప్పారు. రూరల్ గ్రామాల్లో దేవుని సేవ చేస్తున్న పాస్టర్లు, దైవజనులను ప్రోత్సహించేందుకు అసోసియేషన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి మార్కెట్ సెంటరులో ఉన్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు గురువారం తనిఖీ చేశారు. అతని వద్ద తొమ్మిది క్వార్టర్ల మద్యం సీసాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మరిదిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వదిన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడిచేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గుజ్జనగుండ్లకు చెందిన మైమూన్ తన భర్త మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తోంది.
ఆమె మరిది ఆదాం షఫీ తరచూ వదిన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. గురువారం అతను దాడి చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పన్నుల వసూలు లక్ష్యం పూర్తికావాలి

కమిషనర్ వి.నిర్మల్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నిర్మల్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ బి.శివారెడ్డి

తాడేపల్లిరూరల్: మార్చి నెలాఖరుకు పన్నుల వసూలు లక్ష్యాన్ని పూర్తిచేయాలని మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ ఆదేశించారు. పన్నుల లక్ష్యంపై గురువారం పట్టణంలోని కార్పొరేషన్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లను సిబ్బంది మరింత వేగవంతం చేయాలన్నారు. సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో ప్రతిరోజూ రెవెన్యూ అధికారులు సమీక్షించి పన్నుల వసూలు పెరిగేలా చూడాలన్నారు. ప్రతిరోజు వార్డులలో తిరిగి పన్నులు వసూలు చేయాలన్నారు. మొండి బకాయిల యజమానులతో సామరస్యంగా చర్చించి లక్ష్యం నెరవేరేలా చూడాలన్నారు.

గేమింగ్ యాప్‌ల రూపకల్పనలో మెలకువలు అవసరం



పేజ్ టు పిక్చర్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, యలవర్తి సుభాష్ తదితరులు

తాడేపల్లిరూరల్: విద్యార్థులు గేమింగ్ యాప్‌లను రూపొందించడంలో మెళకువలు నేర్చుకోవాలని కేఎల్‌యూ ప్రోగ్రెషన్ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ అన్నారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూలో ఏర్పాటు చేసిన సినీ ఫిలియా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లకు మంచి డిమాండ్ ఉంటుందని అన్నారు. అనంతరం లలిత కళల విభాగం అధిపతి సుభాష్‌తో కలసి పేజ్ టు పిక్చర్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలు సుప్రజ, ఆర్.వెంకన్న బాబు, జె.శ్రీధర్ పట్నాలను అభినందించారు. విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ లలిత కళల విభాగం విద్యార్థులు సినీ ఫిలియా కార్యక్రమంలో భాగంగా పలు రకాల ఫొటో ఆల్బమ్‌లు, వీడియో డాక్యుమెంటరీలు తయారు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, డిప్యూటీ విభాగాధిపతి జాలాది రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేయండి

సబ్ కలెక్టర్‌ను ఆశ్రయించిన రైతు సంఘం నాయకులు



ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తెనాలిరూరల్: దుగ్గిరాలలో ఇటీవల అగ్ని ప్రమాదం సంభవించిన శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లోని పసుపు బస్తాలను యజమాని అక్రమంగా తరలించే సన్నాహాలు చేస్తున్నాడని దీనిని అధికారులు అడ్డుకోవాలని కోరుతూ రైతు సంఘ నాయకులు తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయానికి గురువారం సాయంత్రం వెళ్లిన నాయకులు ఆయనను కలిసి తమ సమస్యను వివరించారు. అగ్ని ప్రమాదం జరిగి 62 రోజులైనా ఇప్పటికీ రైతులకు నష్ట పరిహారం అందలేదని వివరించారు. కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న పసుపు బస్తాల్లో వెయ్యి బస్తాలను యజమాని అక్రమంగా తరలించి అమ్ముకునే యత్నాలు చేస్తున్నాడని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన సబ్‌కలెక్టర్ దుగ్గిరాల తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సీజ్ చేసి ఉన్న కోల్డ్ స్టోరేజ్‌లో సరుకును తరలించడమేమిటని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మంగళగిరి అభ్యర్థిగా బీసీనే నియమించాలి

పొత్తులో భాగంగా ఓసీకి కేటాయించడంతో పదవికి రాజీనామా చేసిన బీజేపీ దుగ్గిరాల మండల అధ్యక్షుడు దానబోయిన

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో బీసీలు అత్యధికంగా ఉన్నా బీసీ అభ్యర్థిని నియమించకుండా పొత్తుల్లో భాగంగా ఓసీ అభ్యర్థిని నియమించడంపై నిరసన వ్యక్తం చేస్తూ దుగ్గిరాల బీజేపీ మండల అధ్యక్షుడు దానబోయిన వెంకట శివాజీ యాదవ్ గురువారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా శివాజీ యాదవ్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో గతంలో బీజేపీ ఎన్నికల్లో పలుమార్లు పోటీచేసినప్పుడు బీసీ అభ్యర్థికే టికెట్ కేటాయించారని ఇప్పుడు బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తులో ఉండగా ఓసీ అభ్యర్థి నారా లోకేష్‌కు టికెట్ కేటాయించడం దారుణమన్నారు. బీసీ అభ్యర్థికి టిక్కెట్ ఇవ్వాలని పలుమార్లు పార్టీ అధిష్టానానికి తెలియజేశానని, వారి వద్ద నుంచి ఎటువంటి సూచనలు రాకపోవడంతో రాజీనామా చేశానని, రాజీనామా లేఖను జిల్లా పార్టీ అధిష్టానానికి అందజేసినట్లు ఆయన తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో బీసీ అభ్యర్థిని నిలబెట్టిన పార్టీకే తన మద్దతు ఉంటుందన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి



పసంగిస్తున్న ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి

తాడేపల్లిరూరల్: విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ పరిశోధనలు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి సూచించారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కె.ఎల్.విశ్వవిద్యాలయంలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాంత్రిక–2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ రంగంలో రాణించాలని ఆకాంక్షించే విద్యార్థులు ఆ దిశగా పరిశోధనలు చేయాలన్నారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల డిమాండ్లపై ఇంజినీర్లు ప్రధాన విభాగాల్లో బలమైన పునాదికి కలిగి ఉండాలని సూచించారు. ఉత్పాదక రంగంలో మారుతున్న డైనమిక్స్‌కు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్‌చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్రాం, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకృష్ణ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ విజయకుమార్, టి. చంద్రశేఖర్, సునీత పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌లకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న డాక్టర్ శోభారాణి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని ప్రివెంటీవ్ మెడిసిన్ రీజినల్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీలో గురువారం వాటర్, ఫుడ్ ఎనాలసిస్‌పై ల్యాబ్ టెక్నీషియన్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథి రీజినల్ ల్యాబ్ సివిల్ సర్జన్ బ్యాక్టీరియాలజిస్ట్, ఇన్‌చార్జి ఆర్డీ డాక్టర్ జి.శోభరాణి మాట్లాడారు. ల్యాబ్ టెక్నీషియన్‌లకు నూతన వైద్య పద్ధతుల నేర్చుకునేందుకు శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. గత నెలలో గుంటూరులో అవుట్ బ్రేక్ అకడమిక్ వచ్చినప్పుడు రీజినల్ ల్యాబ్ సిబ్బంది సమష్టిగా పనిచేసి 972 శాంపిల్స్ సేకరించారని గుర్తుచేశారు. ఇది రీజినల్ లేబొరేటరీలో అత్యధిక సంఖ్యలో శాంపిల్స్ సేకరణగా పేర్కొన్నారు. అత్యధిక శాంపిల్స్ సేకరించి, రాష్ట్రంలోనే ఇతర రీజినల్ ల్యాబ్‌లకు గుంటూరు ల్యాబ్ మార్గదర్శకంగా నిలిచిందన్నారు. కొత్తగా ల్యాబ్‌లో చేరిన వారు మెళకువలు నేర్చుకుని సకాలంలో ఖచ్చితమైన ఫలితాలను అందించాలన్నారు.

28 లోగా పన్ను వసూళ్లు పూర్తిచేయాలి

నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి

నెహ్రూ నగర్: నగర పాలక సంస్థ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులకు కేటాయించిన లక్ష్యాలను మార్చి 28 నాటికి పూర్తిచేయాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి ఆదేశించారు. రెవెన్యూ వసూళ్లపై గురువారం ఉదయం కమిషనర్ చాంబరులో డెప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఆర్‌ఐలతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 21వ తేదీ వరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వారీగా పన్ను వసూళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా నగర పాలక సంస్థ ప్రైవేటు డిమాండ్ ద్వారా రూ.63 కోట్లు వసూలు చేయాల్సిన ఉందని తేల్చారు. రూ.33 కోట్లలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వారీగా టార్గెట్ విధించారు. వార్డు అడ్మిన్ సెక్రటరీలు ప్రతి ఒక్కరూ ఉదయం 8 గంటల కల్లా పన్ను వసూలుకు వార్డుల్లో తిరిగేలా చూడాలన్నారు. పెద్ద మొత్తంలో ఉన్న పన్ను బకాయిల వసూలు కోసం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు, డెప్యూటీ కమిషనర్లు కూడా పాల్గొని, లక్ష్యాలను అధిగ మించాలని స్పష్టం చేశారు. డెప్యూటీ కమిషనర్లు చెరువు శ్రీనివాస్, వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.